క్లుప్తంగా

వాయుపుత్రునికి అభిషేక పూజలు


అంజనేయస్వామి

కౌతాళం: మండలంలోని అంజనేయస్వామి ఆలయాలకు శనివారం భక్తులు అధికంగా తరలివచ్చి పూజలు నిర్వహించారు. మండల కేంద్రమైన కౌతాళంతో పాటు మండల పరిధిలోని అగసలదిన్నె గ్రామంలో వెలసిన ఆంజినేయస్వామి, సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుదుములదొడ్డి ఆంజనేయస్వామి, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజినేయస్వామి దేవాలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. తెల్లవారుజామున అర్చకులు స్వామికి సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి ప్రత్యేక పూజలను చేపట్టారు. కౌతాళం వెలసిన వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు.

రణమండల ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

ఆదోని అర్బన్: శ్రావణమాసం మూడో శనివారం సందర్భంగా రణమండల కొండపై వెలిసిన శ్రీ రణమండల ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు టి.జి.పాండురంగశెట్టి ఆధ్వర్యంలో స్వామివారికి ఫల పంచామృతాభిషేకం, సింధూరసేవ, తులసీహారం, వివిధ రకాల అలంకారం, నైవేద్యం, ఆకుపూజ, మహామంగళహారతితో ప్రత్యేక పూజలు జరిగాయి. భారీ సంఖ్యలో వచ్చిన భక్తులకు అన్నదానం నిర్వహించారు.

కె.ఆర్.కృష్ణయ్యశెట్టికి నివాళి


కృష్ణయ్య శెట్టి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అవోపా సభ్యులు

ఆదోని అర్బన్: ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(అవోపా) ఆదోని ఆధ్వర్యంలో అవోపా వ్యవస్థాపకులు కె.ఆర్.కృష్ణయ్యశెట్టి 40వ వర్ధంతిని శనివారం స్థానిక వాసవీ కళ్యాణమండపంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అవోపా అధ్యక్షుడు ఆత్మకూరు సుబ్రహ్మణ్యం సౌజన్యంతో ఆర్థికంగా వెనకబడిన 40 మంది విద్యార్థినీ, విద్యార్థులకు నోటు పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో అవోపా పట్టణాధ్యక్షులు వంకదారు శ్రీనాథ్ గుప్తా, కార్యదర్శి డైమండ్ రఘు, కోశాధికారి యాతగిరి వెంకటేశ్వర్లు, సభ్యులు పాల్గొన్నారు.

వైద్యులపై చర్యలు తీసుకోవడంలో విఫలం


డీఎంహెచ్ఓ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: ప్రైవేట్ క్లినిక్‌కు ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వ ఆసుపత్రిలో విధులకు డుమ్మా కొడుతున్న వైద్యులపై చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం, ఉన్నతాధికారులు విఫలమవుతున్నారని ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజీవ్ ఆరోపించారు. శనివారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో పట్టణంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారుల దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో నవజాత శిశువు మృతికి కారణమైన వైద్యులపై అధికారులు చర్యలు తీసుకోలేదన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్‌పై ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు ప్రతాప్, సందీప్,ఏసురాజు తదితరులు పాల్గొన్నారు.

15 లోపు పంట నమోదు పూర్తి చేయాలి


పంట నమోదును పరిశీలిస్తున్న ఏడీఏ

పెద్దకడబూరు: ఈ పంట నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని వ్యవసాయ సహాయ సంచాలకులు కే.అరుణకుమారి సూచించారు. మండల కేంద్రంలో వ్యవసాయాధికారి ఎం.వరప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం ఈ పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ సెప్టెంబర్ 15లోపు ఈ పంట నమోదుతో పాటు రైతులతో ఈకేవైసీ పూర్తి చేయించాలన్నారు. ఏడీఏ మాట్లాడుతూ ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితుల వల్ల ఇప్పటి వరకు విత్తనం వేయని రైతులను గుర్తించినట్లు తెలిపారు. కొర్ర, జొన్న, సజ్జ వంటి పంటలకు సంబంధించిన విత్తనాలు 80శాతం సబ్సిడీతో ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం మండల పరిధిలోని హనుమాపురం గ్రామం రైతు సేవా కేంద్రంలో సిబ్బందితో ఈ పంట నమోదు, పంటకోత ప్రయోగాలపై సమావేశం ఏర్పాటు చేశారు. సహాయ గణాంక అధికారి(ఏఎస్ఓ) వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పంటకోత ప్రయోగాలపై వ్యవసాయ సహాయకులు జాగ్రత్త వహించాలన్నారు.

భద్రత లేకుండా పని చేయలేని పరిస్థితి



ప్రభుత్వాసుపత్రిలో పనిచేసే వైద్యులకు భద్రత లేకుండా పని చేయడం చాల కష్టం. ఈ మధ్యకాలంలో ప్రమాదాలు జరిగినప్పుడు వైద్యం కోసం వచ్చేవారు వైద్యుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారు. వారిని ఎదురించలేని పరిస్థితి. ప్రభుత్వం వైద్యుల రక్షణకు కఠిన చర్యలు తీసుకునేల చట్టం తీసుకురావాలి అప్పుడే ధైర్యంగా వైద్య సేవలు అందించవచ్చు. ప్రత్యేక చట్టాలు తీసుకురావాల్సిన అవసరం ఎంతైన ఉంది.

– డాక్టర్ బాలాజీకుమార్, సీఎస్ఆర్ఎంఓ, ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రి

భద్రత కల్పించి ధైర్యాన్ని నింపాలి



మహిళా డాక్టర్లకు భద్రత కల్పించి ధైర్యాన్ని నింపాలి. రాత్రివేళలో వారికి డ్యూటీలు వేయకుండా చూడాలి. ఒకవేళ డ్యూటీ వేసినా సెక్యూరిటీని, సీసీ కెమెరాల నిఘాను పెంచాలి. వైద్యులపై ఎవరైనా దాడులకు పాల్పడితే కఠినమైన శిక్ష విధించేలా ప్రభుత్వం జీఓను తీసుకురావాలి.

– డాక్టర్ కృష్ణమూర్తి, కంటి వైద్యుడు, ఐఎంఏ స్టేట్ వర్కింగ్ కమిటీ సభ్యుడు

కౌలు రైతులకు మొండి చెయ్యి!

- గుర్తింపు కార్డుల పంపిణీ చేయని ప్రభుత్వం
- పంట రుణమూ ఇవ్వడం లేదు
- అన్నదాత సుఖీభవ అమలు చేయని వైనం
- పెట్టుబడి కోసం అప్పులపాలవుతున్న కౌలు రైతులు


నాటుకు సిద్ధంగా ఉన్న వరినారు

ఎమ్మిగనూరు: ఒక పక్క ప్రభుత్వ నిరాదరణ.. మరో పక్క బ్యాంకర్ల మొండి చెయ్యితో కౌలురైతులు కుదేలవుతున్నారు. పెట్టుబడికి లేక..రైతు భరోసా అందక .. ఇటు కౌలు చెల్లించలేక అప్పుల ఊబిలో కూరుకుపోయి పంట విరామం ప్రకటిస్తున్నారు. ఏటేటా వ్యవసాయ ఒడిదుడుకులు అధికమై కష్టాలతో సేద్యం..కన్నీళ్లతో కాలం గడపడం కౌలురైతుల వంతైంది. ఈ ఏడాది పంటల సమయం అదనుదాటినా ఇప్పటికీ రుణ అర్హత కార్డులు కూడా పూర్తిస్థాయిలో ఇవ్వలేదు. ఒక్క రైతుకూ పంట రుణం అందలేదు. బ్యాంక్‌ల్లో ఇచ్చే రుణాల్లో 10శాతం కౌలు రైతులకు రుణాలుగా ఇవ్వాలని నిబంధనలు ఉన్నా ఒక్కరికీ మంజూరు చేయడంలేదు. కౌలు రైతులపై ప్రభుత్వానికి ఉన్న ప్రేమ ఎంతో రుణ అర్హత కార్డుల మంజూరును బట్టే అర్థమవుతుంది. అదే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సమయానికి కౌలు కార్డులు పంపిణీ చేయడంతో పాటు బ్యాంకుల ద్వారా రుణాలు, సకాలంలో రైతు భరోసా సాయం అందేదని కౌలు రైతులు చెబుతున్నారు.

3,585 మంది కౌలురైతుల గుర్తింపు

ఖరీఫ్ సీజన్ ఆరంభంతో కౌలు రైతులకు కష్టకాలం ఎదురైంది. అర్హులైన రైతులందరికీ రుణ అర్హత కార్డులు మంజూరు, వారికి బ్యాంకు రుణాలు, సబ్సిడీ విత్తనాలు, ముఖ్యంగా తుఫాన్‌లు, వరదలు వచ్చినప్పుడు నష్ట పరిహారం మంజూరు చేయడం ఈ కార్డుల ముఖ్య ఉద్దేశం. ఎమ్మిగనూరు సబ్‌డివిజన్ పరిధిలో ఆయా గ్రామాలలో 7,000 మంది వరకూ కౌలు రైతులు పొలాలు కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నారు. ఈ ఏడాది ప్రభుత్వం ఎమ్మిగనూరు మండలంలో 1170, నందవరం మండలంలో 762, గోనెగండ్లలో 862, మంత్రాలయంలో 791 మందిని రెవెన్యూ అధికారులు గ్రామసభల ద్వారా కౌలు రైతులుగా గుర్తించారు. వీరికి రుణ అర్హత కార్డులు తయారు చేశారు. అయితే నెలలు గడుస్తున్నా, ఖరీఫ్ కాలం ముగుస్తున్నా రైతుల చేతికి రుణ అర్హత కార్డులు మాత్రం పూర్తి స్థాయిలో చేరలేదు. ఇప్పటికి వరకూ ఒక్క కౌలు రైతుకూ బ్యాంకులు రుణాలు మంజూరు చేయకపోగా.. కౌలు రైతులు అంటే రుణాలు ఇచ్చే పరిస్థితి లేదని బ్యాంకర్లు తేల్చి చెబుతున్నారు.

3,585 కార్డులు సిద్ధం చేశాం



కౌలురౌతులకు గుర్తింపు కార్డులను రెవెన్యూ, వ్యవసాయాధికారులు కలసి ఇవ్వాలి. ఎమ్మిగనూరు సబ్‌డివిజన్‌లో 3585 మందిని కౌలు రైతులుగా గుర్తించాం. వీరందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాల్సి ఉంది. గుర్తింపుకార్డు ఉన్న కౌలు రైతులకు రుణాలు ఇవ్వాలని బ్యాంకర్ల సమావేశంలో కోరాం. బ్యాంకర్లు ముందుకురాకపోతే మేమేమి చేయలేం. – మహ్మద్‌ఖాద్రి, ఏడీఏ

వడ్డీ వ్యాపారులే దిక్కు..

వ్యవసాయంపై ఉన్న మమకారల.. కుటుంబాలను ఆర్థికంగా నిలదొక్కుకొనేలా చేయాలనే ఆశతో ఎకరం రూ. 15వేల నుంచి రూ. 30వేల వరకూ కౌలుకు తీసుకుని రైతులు సాగుకు చేపట్టారు. పత్తి పంటకు రూ. 30వేలు, వరి పంటకు రూ. 25వేలు, మిరప పంటకు రూ. 55వేల వరకూ ఎకరానికి పెట్టుబడులు అవుతాయి. కౌలు రైతులకు ప్రభుత్వం నుంచి గాని, బ్యాంకర్ల నుంచి గానీ ఎటువంటి సహకారం లేకపోవడంతో పెట్టుబడులకు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో రుణ అర్హత కార్డులు మంజూరు చేసి బ్యాంకులద్వారా రుణాలు మంజూరు అయ్యేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

రుణాలు ఇవ్వడంలేదు



15ఎకరాలు కౌలుకు తీసుకున్నా. మిరప, పత్తి పంటలు సాగుచేశా. కౌలు రైతుగా గుర్తించారు గానీ కార్డు ఇవ్వలేదు. కౌలు చెల్లించడానికీ, పెట్టుబడులకు అధికవడ్డీలకు అప్పులు చేశాం. ఈఏడాది రైతు భరోసా సాయం లేదు.. పంటల బీమా కూడా ప్రభుత్వం పట్టించుకోలేదు. బ్యాంక్ రుణాలు ఇవ్వడం లేదు. రెండు నెలల నుంచి బ్యాంక్‌ల చుట్టూ ,అధికారుల చుట్టూ తిరుగుతున్నా. ఎవరికీ కనికరంలేదు. – భీమిరెడ్డి, గంగవరం

ఎవరూ పట్టించుకోవడం లేదు



ఎనిమిదెకరాలు కౌలుకు తీసుకొని పత్తి పంట సాగుచేశా. రూ.45వేలు పెట్టుబడి పెట్టా. కౌలు రైతు గుర్తింపు కార్డును ఇంతవరకూ ఇవ్వలేదు. బ్యాంకులు రుణం మంజూరు చేయడం లేదు. పేరుకే ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడం తప్పా ఎవరూ కౌలు రైతులను పట్టించుకోవడంలేదు. రైతులెట్లా బతకాలి. – జయన్న, హాలహర్వి, కౌలురైతు

గోనెగండ్లలో బీసీ హాస్టల్ ఏర్పాటు చేయాలి

గోనెగండ్ల : మండల కేంద్రం గోనెగండ్లలో బీసీ బాలుర హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని రాయలసీమ విద్యార్థి సంఘాల నాయకులు పాండు, నాగరాజు కోరారు. ఈ మేరకు శనివారం విద్యార్థి సంఘాల నాయకులు ఎంపీ బస్తిపాడు నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లోంచి విద్యార్థులు మండల కేంద్రం గోనెగండ్లకు చదువుకోవడానికి వస్తున్నారని తెలిపారు. అయితే కొన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం కూడా లేదన్నారు. దీంతో విద్యార్థులు చాలా అవస్థలు పడుతూ పాఠశాలలు, కళాశాలలకు వెళ్తున్నారని చెప్పారు.

కర్ణాటక మద్యం తరలిస్తున్న మహిళ అరెస్ట్

ఆదోని రూరల్: పెద్దకడబూరు మండలం తారాపురం గ్రామానికి చెందిన బోయ ఈరమ్మ అనే మహిళ కర్ణాటక మద్యాన్ని తరలిస్తుండగా అరెస్టు చేసినట్లు ఇస్వీ ఎస్ఐ నాగేంద్ర శనివారం విలేకరులకు తెలిపారు. బోయ ఈరమ్మ కర్ణాటక నుంచి 90 ఎం.ఎల్. పరిమాణం గల 192 టెట్రా ప్యాకెట్లను తీసుకొస్తుండగా మదిరె క్రాస్ రోడ్డు వద్ద పట్టుకున్నట్లు చెప్పారు. ఆమెపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్ట్

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని కర్నూలు రోడ్డులోని పెట్రోల్ బంక్ వద్ద రజాక్ అనే యువకుడిపై కొద్ది రోజుల క్రితం జరిగిన హత్యాయత్నం కేసులో పరారీలో ఉన్న నిందితుడు కొండాపురి మహమ్మద్ యహియాను అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ సుదర్శన్‌రెడ్డి శనివారం రాత్రి తెలిపారు. ఈ కేసులో నిందితుడు కొద్ది రోజులుగా తప్పించుకొని తిరుగుతుండగా శనివారం రోజు ఆదోని బైపాస్ రోడ్డులోని రావూస్ డిగ్రీ కాలేజీ సమీపంలోని ఖాళీ ప్రదేశంలో ఉండగా పట్టణ ఎస్ఐ డాక్టర్ నాయక్ తన సిబ్బందితో వెళ్లి అరెస్ట్ చేశారన్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ 14 రోజులు రిమాండ్‌కు ఆదేశించినట్లు వెల్లడించారు.

బాధితుడికి ఆర్థిక సాయం


బాధితుడికి ఆర్థిక సాయం అందజేస్తున్న వార్డు ఇన్‌చార్జ్ తాయన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆదోని టౌన్: పట్టణంలోని తిక్కస్వామి దర్గా ఏరియాలో నివాసముంటున్న ఈరన్న గుడిసెపై రెండు రోజుల క్రితం పిడుగుపడింది. దీంతో పూరిగుడిసె ధ్వంసమయ్యింది. అయితే అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఈ విషయాన్ని ఆ వార్డు కౌన్సిలర్ శాంతమ్మ, వార్డు ఇన్‌చార్జ్ తాయన్న మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. బాధితుడికి మానవతాదృక్పథంతో మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి రూ.10 వేలు ఆర్థిక సాయంగా అందజేశారు. శనివారం తాయన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు బాధితుడి ఇంటి వద్దకు వెళ్లి నగదును అందించారు. దీంతో బాధితుడు కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రాణాలతో బయటపడ్డ తమకు మాజీ ఎమ్మెల్యే ఆర్థిక సాయం అందించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి


మాట్లాడుతున్న ఎంపీపీ గొల్ల కేశన్న

ఎమ్మిగనూరురూరల్: గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు కృషి చేయాలని మండల అధ్యక్షులు గొల్ల కేశన్న అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో మండల సర్వసభ్య సమావేశం మండల ప్రత్యేకాధికారి విజయకుమార్ ఆధ్వర్యంలో జరిగింది. సమావేశంలో ఆయా శాఖల అధికారులు తమ శాఖ చేపట్టిన పనుల గురించి వివరించారు. కొందరు సర్పంచులు తమ పంచాయతీ నిధులు ఇతర పనులకు వాడుకుంటున్నారని ఆరోపించారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సమస్యలున్నట్లు అధికారుల దృష్టికి వస్తే వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులపై వైద్య అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ బంగారమ్మ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కన్నడ భాషా సంస్కృతిని కాపాడుకుందాం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కన్నడ సంఘం సభ్యులు

ఆదోని సెంట్రల్: కన్నడ భాషా సంస్కృతిని కాపాడుకుందామని కర్ణాటక విద్యావర్ధక సంఘం ధారవాడ ప్రధాన కార్యదర్శి శంకర్ ఆలగత్తి, సంఘం అధ్యక్షుడు చంద్రకాంత్ పిలుపునిచ్చారు. శనివారం రెడ్డీస్ భవన్‌లో అఖిల భారత రాష్ట్ర కన్నడ ఆర్గనైజేషన్ 9వ కన్నడ మహామేళాను సంఘం సభ్యులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ తెలుగు, కర్ణాటక రాష్ట్రాలతో పాటు ఆయా రాష్ట్రాల్లో ఉన్న కన్నడిగుల సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా కన్నడ చదివే విద్యార్థులకు కన్నడ పాఠ్య పుస్తకాలను సకాలంలో అందించి వారి విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. అనంతరం కన్నడ సంఘం అధ్యక్షులు కృష్ణమూర్తి కన్నడ భాష సంస్కృతి, సంప్రదాయాలు, కట్టుబాట్లు, పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో చౌకి మఠం పీఠాధిపతి మర్రి రాచోటి స్వామి, కల్లుమఠం పీఠాధిపతి గురుసిద్ధ దేవరు, కన్నడ సంఘం నాయకులు ఆది బసవరాజు, శరణ బసప్ప, సుగూరప్ప డిప్యూటీ ఈఓ వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

దేవతామూర్తులకు జలాభిషేకం


గంగజలంతో ఊరేగింపుగా వస్తున్న గ్రామస్థులు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని గుడేకల్ గ్రామంలో శ్రావణ మాసం మూడవ శనివారం సందర్భంగా గంగా జలంతో దేవతామూర్తులకు జలాభిషేకం చేశారు. శుక్రవారం గ్రామస్తులు ఏటికి వెళ్లి గురుజాల వద్ద గంగా జలం తీసుకొని శనివారం గ్రామానికి చేరుకున్నారు. పెద్ద సంఖ్యలో గ్రామస్తులు మేళతాళాలతో ఊరేగింపుగా గంగా జలం తెచ్చిన వారికి స్వాగతం పలికారు. అనంతరం ఊరేగింపుగా వెళ్లి అన్ని దేవాలయాల్లోని దేవతామూర్తులకు జలంతో అభిషేకం చేశారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పాడిపంటలు బాగాపండాలని, అంతా మంచి జరగాలని ప్రతి సంవత్సరం ఇలా చేయడం ఆనవాయితీగా వస్తుంది. కార్యక్రమంలో గ్రామ పెద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు వై. రుద్రగౌడ్, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి నదీజలాలతో అభిషేకం

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని కడపాళెం వీధిలో వెలసిన శ్రీ ఆంజనేయ స్వామికి తుంగభద్ర నది జలాలలో భక్తులు అభిషేకం గావించారు. శ్రావణ మాసం మూడవ శనివారం సందర్భంగా గ్రామం నుంచి 100 మందికి పైగా భక్తులు మండలంలోని సాతనూరు గ్రామ సమీపంలో తుంగభద్ర నది పాదయాత్రగా వెళ్లి అక్కడ పుణ్యస్నానాలు ఆచరించి, నదీమ తల్లికి పూజలు చేసి, బిందెల్లో నది జలాలను మోసుకుని మేళతాళాలతో స్వగ్రామానికి చేరుకున్నారు. నదీ జలాలతో స్వామి వారికి అభిషేకం చేసి పూజలు చేసుకుని, నారికేళాలు సమర్పించి భక్తులు మొక్కులు చెల్లించారు. అలాగే కొందరు భక్తులు కోసిగి కొండపై వెలసిన తిమ్మప్ప స్వామికి నది జలాలతో అభిషేకం చేసి పూజలు చేశారు. అదే విధంగా మండల పరిధిలోని గ్రామాల్లో కొలువుతీరిన దేవతలు ఈశ్వర దేవాలయం, మార్కండేయ స్వామి, గీతామందిరరం, ఆలుకూరప్ప, మారెమ్మ దేవి, రామక్కమ్మ దేవి, రామాలయం తదితర దేవాలయాల్లో దేవతలకు నదీ జలాలను సమర్పించి మొక్కులు చెల్లించారు. గ్రామాల్లో వర్షాలు సమృద్ధిగా కురవాలని వేడుకున్నారు.

పేలుడు పదార్థాలు స్వాధీనం

ఆదోని అర్బన్: పట్టణశివారులోని మండిగిరి కొండలో త్రీటౌన్ పోలీసులు పేలుడు పదార్థాలను శనివారం స్వాధీనం చేసుకున్నారు. సమాచారం మేరకు తహసీల్దార్ శివరాముడు, సిబ్బంది కొండపై తనిఖీ చేపట్టారు. కొండను పేల్చే పేలుడు పదార్థాలు లభ్యం కావడంతో వాటిని పంచనామా చేసి త్రీటౌన్ పోలీసులకు అప్పగించారు. ఈ విషయంపై త్రీటౌన్ సీఐ రామలింగప్పను వివరణ కోరగా, రెవెన్యూ అధికారులు అందజేసిన పేలుడు పదార్థాల్లాంటి వాటిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇవి పేలుడు పదార్థాలేనా కాదా నిర్ధారించాల్సి ఉందన్నారు.

కోనా వేంకటేశ్వరుడికి పూజలు

సి.బెళగల్: మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి గ్రామ కొండపై వెలసిన శ్రీ కోనా వేంకటేశ్వర స్వామికి శనివారం పూజారులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. భూదేవి, అలివేలిమంగమ్మ సమేత శ్రీ కోనా వేంకటేశ్వర స్వామి మూల విగ్రహాలకు అభిషేకం తదితర పూజలు చేశారు. గ్రామాలకు చెందిన భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు


ఎమ్మిగనూరులో ఉట్టి కొడుతున్న బాలకృష్ణుడు

ఆదోని సెంట్రల్: పలు పాఠశాలల్లో శనివారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలో మిల్టన్ గ్రామర్ పాఠశాలలో విద్యార్థులు కృష్ణుడు, గోపికల వేషధారణలతో చూపరులను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఎంతగానో అలరించాయి. అనంతరం ఉట్టిని కొట్టి ఒకరికి ఒకరు కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.


కౌతాళంలో కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు

కార్యక్రమములో పాఠశాల ప్రిన్సిపాల్ నాగరాజు, వైస్ ప్రిన్సిపాల్ రంగస్వామి, పాఠశాల కరస్పాండెంట్ రమేష్ బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కౌతాళం: శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకొని శనివారం మండల కేంద్రమైన కౌతాళంలోని స్థానిక ప్రతిభ హైస్కూల్‌లో శ్రీకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి పూజా కార్యక్రమాలను చేపట్టారు. చిన్నారులు వేసిన వేషాధారణలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. చిన్నారులు వేసిన శ్రీకృష్ణుడు, రుక్మిణి, సత్యభామల వంటి వేశధారణలు చిన్నారులు చేసిన నృత్యాలు, పాటలు అలరించాయి. కరస్పాండెంట్ దూద్‌బాష, హెచ్ఎం జ్ఞానేశ్వరి పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్/రూరల్: పట్టణంలోని పలు పాఠశాలలో ముందస్తుగా శ్రీకృష్ణాష్టమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక భాష్యం , ఐస్కూల్, నారాయణ తదితర పాఠశాలల్లో విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో ప్రదర్శించిన నృత్యాలను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆయా పాఠశాలల కరస్పాండెంట్‌లు, ప్రిన్సిపాల్‌లు ప్రిన్సిపాల్ మాచాని కవిత, యుయు.నరేంద్రప్రసాద్, సురేష్‌కుమార్ ,ఏఓ జాకీర్‌హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

కుల ధ్రువీకరణపై ప్రతి ఇంటినీ సందర్శించాలి


హనుమాపురం గ్రామంలో కుల ధ్రువీకరణపై ఆరా తీస్తున్న జేసీ బి.నవ్య

పెద్దకడబూరు: సుమోటో కుల ధ్రువీకరణపై అధికారులు క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటిని సందర్శించి పరిశీలించాలని జాయింట్ కలెక్టర్ బి.నవ్య తెలిపారు. సుమోటో కుల ధ్రువీకరణపై క్షేత్రస్థాయి ప్రదర్శనలో భాగంగా మండల పరిధిలోని హనుమాపురంలో శనివారం ఆమె పర్యటించారు. ఆమె మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ఉన్న అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి పూర్తిస్థాయిలో విచారణ చేసి నివేదికలను పంపాలన్నారు. ఒకవేళ ఏదైనా సమస్య ఉంటే వాటిపై విచారణ జరిపి ఉన్నాధికారులను అందజేయాలన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ (ఇన్‌చార్జ్) సి.విశ్వనాథ్, తహసీల్దారు శ్రీనివాసులు, డిప్యూటీ తహసీల్దారు మహేష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక డంప్‌ను పరిశీలించిన జేసీ

కౌతాళం: డంప్ చేసిన ఇసుకను తక్కువ ధరకైనా ప్రభుత్వ కార్యాలయాలకో, ఇంటి నిర్మాణాలకో ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ నవ్య ఆదేశించారు. శనివారం ఆమె గుడికంబాలి ఇసుక రీచ్ డంప్‌ను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ డంప్ చేసిన చోట ఇంకా ఇసుక వంద టన్నులకు పైగానే ఉందని దీనిని ప్రభుత్వ కార్యాలయాలకో ఇంటి నిర్మాణాలకు కావాల్సిన వారికి తక్కువ ధరలకైనా అమ్మాలని అధికారులను సూచించారు. డంప్ చేసిన చోట భూమిపై ఇంకా ఇసుక ఉందని దీని కోసం తహసీల్దారు సమావేశం ఏర్పాటు చేసి ఈ విషయాన్ని ప్రకటించాలని ఆదేశించారు. ఆమె వెంట ఆదోని ఇన్‌చార్జ్ సబ్ కలెక్టర్ విశ్వనాథ్, మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్, తహసీల్దారు మల్లికార్జునస్వామి, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

సమస్యలన్నీ పరిష్కరిస్తాం


మెడికల్ కళాశాల మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎంపీ నాగరాజు

ఆదోని రూరల్: నియోజకవర్గంలో సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని ఎంపీ పంచలింగాల నాగరాజు హామీ ఇచ్చారు. ఆదోని మండలంలోని నాగలాపురం దగ్గర ఉన్న ప్రభుత్వ మెడికల్ కాలేజీని శనివారం ఎంపీ సందర్శించారు. డీఎస్పీ సోమన్న, తహసీల్దార్ శివరాముడు, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు, ఆర్ఎంఓ డా.జగదీష్ స్వాగతం పలికారు. ఎంపీ మాట్లాడుతూ ఆదోని నియోజకవరలో సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మెడికల్ కళాశాలను సందర్శిస్తూ జిల్లాలో పశ్చిమ ప్రాంతమైన ఆదోని ప్రాంతాన్ని అన్నివిధాలా అభివృద్ధి కార్యక్రమాలకు ముందుంటానని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ బీసీ సాధికారత కమిటీ డైరెక్టర్ చాగి మల్లికార్జునరెడ్డి, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప, సర్పంచ్ దొడ్డనకేరి శివ్ప, మాజీ సర్పంచ్ ఆనవాల్ మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

జీడీపీ పనులు త్వరగా పూర్తి చేయండి

గోనెగండ్ల : గాజులదిన్నె ప్రాజెక్టులో జరిగే అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీ నాగరాజు సూచించారు. శనివారం గాజులదిన్నె ప్రాజెక్టును సందర్శించారు. జీడీపీ సామర్థ్యం , జీడీపీలో ప్రస్తుతం నీటి నిల్వ, ప్రాజెక్టుకు ఎక్కడక్కడ నుంచి నీరు వచ్చి చేరుతుందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఈఈ శైలేశ్వర్, డీఈ విజయ్ కుమార్, ఏఈ మహమ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

నవోదయ విద్యాలయం పరిశీలన

ఎమ్మిగనూరురూరల్: విద్యార్థులు కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కర్నూలు ఎంపీ నాగరాజు అన్నారు. శనివారం మండల పరిధిలోని బనవాసి జవహార్ నవోదయ విద్యాలయాన్ని సందర్శించారు. విద్యాలయంలో ఏమైన సమస్యలను, విద్యార్థులకు అందుతున్న విద్యాబోధన గూరించి అడిగి తెలుసుకున్నారు. విద్యాలయ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ చందిరన్, సీనియర్ అధ్యాపకులు బసవరాజు ఉన్నారు.